

# హైదరాబాద్ వార్త

## నగరంలో పెరుగుతున్న చలి తీవ్రత

**హైదరాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త :** నగరంలో చలితీవ్రత క్రమంగా పెరుగుతుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు సైతం క్రమంగా తగ్గుతున్నాయి. మూడు రోజులుగా నగరంలో చలి గాలుల తీవ్రత పెరిగింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 15 డిగ్రీలకు దిగువన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రివేళ చలితీవ్రత ఎక్కువగా ఉంది. రాజేంద్రనగర్‌లో 14.3 డిగ్రీలు, బేగంపేటలో 17.5 డిగ్రీలు, దుండిగల్‌లో 17.8 డిగ్రీలు, హయత్‌నగర్‌లో 16.6 డిగ్రీలు, హకీంపేటలో

### పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

15.5 డిగ్రీల కనిష్టఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెంలో 12.2 డిగ్రీలు, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాబాద్లో 12.6 డిగ్రీలు, మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లిలో 13.8డిగ్రీలు, కుత్బుల్లాపూర్, శామీర్‌పేటలో 14.4 డిగ్రీలు, అత్యల్పంగా 12.2 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా మన్నెగూడలో 12.2 డిగ్రీలు, వికారాబాద్లో 12.7 డిగ్రీల ఉష్ణోగ్రత అత్యల్పంగా నమోదైంది. గత మూడు రోజులుగా చలిగాలుల తీవ్రత పెరగడంతో రాత్రి వేళల్లో ముఖాలకు మాస్కులు లేకుండా బయటకు రాలేనిపరిస్థితి నెలకొన్నాయి. చలి తీవ్రత పెరగడంతో మార్నింగ్ వాకింగ్ చేసే వారి సంఖ్య తగ్గుతోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉదయమే పనుల కోసం వెళ్లే ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ చేతులు, కాళ్లు శరీరంతో పాటు చెవులను కూడా కప్పి ఉంచుకోవాలని, లేకపోతే అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా చలి తీవ్రత పెరిగే కొద్దీ శరీరంలో మార్పులు రావడం కూడా మొదలవుతుందని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



నగర శివార్లలో తెలంగాణ సాయుధ పోరాట

## తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ



దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 24 ప్రభాతవార్త:** నగర శివార్లలోని మహేశ్వరం నియోజక వర్గం బాలాపూర్ మండల పరిధి మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చందన చెరువు కట్ట పై ఆదివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణ జరిగింది. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్థానిక కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, సిద్దాల పద్మ అంజయ్య, సిద్దాల లార్డ్స్ బీరప్ప, సిద్దాల మౌనిక శ్రీశైలం కురుమలు తమ స్వంత డబ్బులతో తయారు చేయించిన నిలువెత్తు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మీర్‌పేట్ కార్పొరేషన్ కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల మహేష్‌కురుమ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బిఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, దీప్‌లాల్‌చౌహాన్, కార్పొరేటర్లు పోరెడ్డి పద్మా భాస్కర్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, ఎనుగుల అనిల్ యాదవ్, ఉయ్యాల నవీన్‌గౌడ్, రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు క్యామ మల్లేష్, మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, నాయకులు సిద్దాల బీరప్ప, సిద్దాల భరత్, మాదరి రమేష్, దోమలపల్లి రాజ్‌కుమార్, షెల్వోజి బొడ్డు ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆరు లక్షల హవాలా డబ్బులు స్వాధీనం

**బేగంబజార్, నవంబరు 24 ప్రభాతవార్త:** ద్విచక్రవాహనంలో 6లక్షల 69వేలు నగదును తీసుకు వెళ్తున్న ఒక వ్యక్తిని సుల్తాన్‌బజార్ ఎసిపి శంకర్ అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం హన్‌మాన్‌టేకిడి ప్రాంతానికి చెందిన వ్యక్తి బ్యాగ్‌లో హవాలా డబ్బులను తీసుకు వెళ్తుండగా ఎసిపి శంకర్‌కు అనుమానం వచ్చి ఆపి సోదాచేయగా అందులో 6 లక్షల 69 వేల హవాల డబ్బులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అతడిని సుల్తాన్‌బజార్ పోలీసులకు అప్పగించారు. సుల్తాన్‌బజార్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### చంపాపేట చౌరస్తాలో యువకుడి హల్‌చల్

**సైదాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త:** మద్యం తాగి ఒక యువకుడు చంపాపేట చౌరస్తాలో శనివారం రాత్రి హంగామా సృష్టించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. చంపాపేట చౌరస్తాలో శనివారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో అటుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని ఆపి పోలీసులు తనిఖీ చేయడానికి ప్రయత్నించగా అతను హంగామా సృష్టించాడు. ట్రాఫిక్ పోలీసులు ఆ యువకుడి ద్విచక్ర వాహనాన్ని పోలీస్ వాహనంలోకి ఎక్కించడానికి ప్రయత్నించారు. దీంతో ప్రాణం పోయినా బండి ఇచ్చే ప్రసక్తే లేదంటూ ఆ యువకుడు హంగామా సృష్టించాడు. తాను దొంగను కాదని, మద్యం తాగలేదని, పోలీసులే కొట్టారంటూ మద్యం మత్తులో కాసేపు వీరంగం సృష్టించాడు. ట్రాఫిక్ పోలీసులు నచ్చచెప్పడానికి ప్రయత్నించినా అతను వినిపించుకోకుండా తన బండి తనకు ఇవ్వాల్సిందేనంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. తన పేరు శివకృష్ణ అని పోలీసులకు ఆ యువకుడు తెలిపాడు.

### పాతబస్తీలో వృద్ధుడి మృతదేహం లభ్యం

**చార్మినార్, నవంబరు 24 ప్రభాతవార్త :** పాతబస్తీ పెట్లాబుర్జు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి పార్కింగ్‌వద్ద ఈ నెల 21వ తేదీన గుర్తు తెలియని వృద్ధుడు(70) మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న హుస్సేనీఆలం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వృద్ధుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురిలో భద్రపరిచారు. చనిపోయిన వృద్ధునికి సంబంధించిన కుటుంబ సభ్యులు, బంధువులు 8712661284 హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ నెంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ నర్సింహ తెలిపారు.

## మత్తులో జోగుతున్న యువత

* అదేదారిలో కాలేజీ విద్యార్థులు..
* సీరియస్‌గా తీసుకున్న పోలీసులు



**హైదరాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త** హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా అంతకంటే ముందు మాదక ద్రవ్యాలకు నిలయంగా మారుతోంది. ఒకప్పుడు అక్కడక్కడా మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు విని విడ్డూరంగా భావించేవారు. కాని తాజాగా వెలుగులోకి వస్తున్న మాదక ద్రవ్యాల వినియోగం చూస్తుంటే భావితరాలు ఎలాంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆందోళన వ్యక్తం అవుతోంది. డ్రగ్స్ మహమ్మారివల్ల యువత వింత చేష్టలు, నలుగురిలోఉన్నా ఒంటరిగానే ఉండడం, పార్టీ ఏదైనా మత్తులో తూగడం వంటి సంఘటనలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పార్టీలు, పబ్‌లు ఇలా ఎక్కడైనా ఏదో ఒక స్థాయిలో డ్రగ్ వినియోగం పెరగడంతో యువత తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. స్నేహితులతో కలిసి డ్రగ్స్ తీసుకుని వచ్చి ఇంట్లో ఒంటరి జీవితం గడుపుతున్నారు. డ్రగ్స్ వినియోగం పెరిగి వింతగా ప్రవర్తించిన సంఘటనలతో వారి తల్లిదండ్రులు భయపడి చికిత్స కోసం వైద్యుల వద్దకు పరుగులు తీసే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల పలువురు విద్యార్థులు డ్రగ్స్, గంజాయి విక్రహిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనలు ఆందోళన కలిగిస్తోంది. డ్రగ్స్‌ను నియంత్రించాలని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో విశ్వ ప్రయత్నం చేస్తోంది.

**నగర శివార్లలోనూ...**

నగరంలోనే కాకుండా శివారులోని పలు విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు గంజాయి, కొకైన్, ఓజీ, ఎల్ఎస్‌డీ, బ్లాట్స్ తీసుకున్నట్లు టీజీన్యాబ్ గుర్తించింది. కళాశాలలకు ఎత్తైన గోడలు ఇతరులు ఎవరూ లోనికి రాలేని పరిస్థితి పటిష్టమైన వ్యవస్థను సిద్ధం చేసుకొని ఉండగా వాటిల్లో కూడా మత్తు పదార్థాలు చేరుతున్నాయి. బంజారాహిల్స్, శంషాబాద్, ధూల్‌పేట్, నానక్‌రామ్‌గూడ తదితర ప్రాంతాల్లోని పెడ్లర్ నుంచి విద్యార్థులు మాదకద్రవ్యాలను కొనుగోలు చేస్తున్నారు. అయితే విద్యార్థులను పర్యవేక్షించాల్సిన హాస్టల్ వార్డెన్‌లు తమకేమి పట్టనట్లు డ్యూటీ సమయం అయిపోయింది, మాకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని కళాశాలల్లో విద్యార్థులు వందమంది ఉంటే కనీసం ఇరవై మంది విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటుపడ్డట్లు గుర్తించారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్‌ను నియంత్రించాలని కంకణం కట్టుకున్నా, పోలీసు శాఖ అనేక చర్యలు తీసుకున్నప్పటికి పౌరులపాత్రమాత్రం కనిపించడంలేదు. ముఖ్యంగా డ్రగ్స్ వినియోగం జరుగుతున్న కాలేజీల యాజమాన్యం సహకారం లభించడంలేదని తెలుస్తోంది.

**సీనియర్‌లే కారణమా...**

ఒకప్పుడు ర్యాగింగ్ జూనియర్ విద్యార్థులను వేధించినప్పటికి తాజాగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను డ్రగ్స్‌కోసం ఉపయోగించుకుంటున్నారని తెలుస్తోంది. కాలేజీల్లో విద్యార్థుల కదలికలను గమనించిన పోలీసులు ఈ అభిప్రాయానికి వచ్చారు. సీనియర్‌లపై ఫిర్యాదులు చేయడానికి జూనియర్‌లు జంకుతున్నారు. ముందుగా సీనియర్ విద్యార్థులకు డ్రగ్స్ కొనుగోలు చేసి ఇవ్వడానికి సహకరించిన వారే తరువాత, తరువాత డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నట్లుగా గుర్తించారు. నగరంలోని ప్రముఖ విద్యాసంస్థలపై యాంటి నార్కోటిక్ పోలీసులు దృష్టి సారించారు. ఇప్పటికే ఆ కాలేజీల్లో విద్యాసంస్థ యాజమాన్యం, తల్లితండ్రులకు కౌన్సిలింగ్ కూడా నిర్వహించారు. సరదాకోసమో, సీనియర్, స్నేహితులకోసం డ్రగ్స్ వినియోగం ప్రారంభించి అటు తరువాత వాటికి బానిసలుగా మారుతున్నారు. డ్రగ్స్ కొనుగోలు కోసం పైన పేర్కొన్న ప్రాంతాలకు వెళ్లిన కొంత మందికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. సాధారణ పౌరుల కంటే విద్యార్థులే అత్యధికంగా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది.

**నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు...**

ఇలాంటి పరిస్థితులను పూర్తిగా మార్చాలని పోలీసులు కఠినంగా నిర్ణయించుకున్నారు. సమాజం ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా విద్యార్థుల భవిష్యత్తు మత్తుమయం అవుతుందని, ఇలాంటి వాటిని నివారించడంతో ప్రతి ఒక్కరి సహకారం అవసరం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. అయితే తెలంగాణ నార్కోటిక్ బ్యూరో(టీజీఎన్ఏబీ) సీరియస్‌గా తీసుకుంది. కళాశాలల్లో డ్రగ్స్ విక్రయాలు, వినియోగాలు కనిపిస్తే కఠినచర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని కళాశాలలు, పాఠశాలలు, విద్యాసంస్థల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ప్రతీ విద్యాసంస్థ యాజమాన్యం డ్రగ్స్ నియంత్రణలో పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశాలు జారీచేశారు. ప్రతీ విద్యాసంస్థ విద్యార్థుల బ్యాగులను వందశాతం తనిఖీ చేయాలని సూచించారు. ఈ సిగరెట్స్, గంజాయి, లిక్కర్, ఉన్నట్లు ఏమాత్రం తమ తనిఖీల్లో గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

**పెరుగుతున్న కేసులు: వైద్యులు**

ఇలాంటి కేసులు గతంలో కంటే 10 నుంచి 15 శాతం పెరిగినట్లు వైద్యులు చెబుతున్నారు. స్టిమెలెన్స్, నాన్ స్టిమెలెన్స్ అని రెండు రకాల మాదవ ద్రవ్యాలు ఉంటాయని, ఇందులో నాన్ స్టిమిలెన్స్ లో మత్తుగా ఉంటారని, కొకైన్, ఎల్ఎస్‌డి, ఎండిఎంఏ తదితర స్టిమిలెన్స్ డ్రగ్, హెరాయిన్, కొకైన్, డైజోపియన్, గంజాయ్ తదితర వాటిని నాన్ స్టిమెలెన్స్‌గా పరిగణిస్తామని వైద్యులు చెబుతున్నారు. ఈ డ్రగ్ తీసుకోకపోతే వారిలో విత్‌డ్రాయల్ సిండ్రోమ్ చోటుచేసుకుంటాయి. ఈ విధంగా డ్రగ్ తీసుకోవడంవల్ల నిద్ర పట్టదని, కడుపులో నొప్పి, కాళ్లుచేతులు వణకడం, విరేచనాలు, బిగ్గరగా ఏడవడం, నోట్లో నుంచి నీరు కారడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటారు. స్టిమెలెన్స్ డ్రగ్స్ వల్ల వేగంగా గుండె స్పందనలు పెరుగుతాయి. గుండె వైఫల్యం చెందడం, డీ హైడ్రేషన్, మూత్ర పిండాలు వైఫల్యం చెందడం, స్ట్రోక్ వంటి ఇబ్బందులు వస్తాయి. డీ హైడ్రేషన్ వల్ల చనిపోయే ప్రమాదముందని వైద్యులు వివరిస్తున్నా డ్రగ్స్‌ను ఎక్కువ డోసు తీసుకునే వారికి గుండె జబ్బులు ఉంటే వారికి ఆకస్మాత్తుగా గుండెపోటు వస్తుంది. మితిమీరిన డోసువల్ల మెదడు నిస్తేజంగా మారడం, ఊపిరితిత్తులకు ఆక్సిజన్ అందకపోవడం, చనిపోవడం వంటి ముప్పు ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. చాలా రోజుల పాటు ఎక్కువ మోతాదులో డ్రగ్ తీసుకున్న వారు, సైకసిస్‌గా మారుతున్నారు. మతిమరుపు, అనుమానం వంటి ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి డ్రగ్ తీసుకునే వారు అస్తమానం డల్‌గా ఉంటున్నారు.



మాట్లాడుతున్న శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనచారి

## ఒగ్గు కథ పితామహుడు చుక్క సత్తయ్య

### సిరికొండ మధుసూదనాచారి

**హైదరాబాద్, నవంబరు 24, ప్రభాతవార్త:** ఒగ్గుకథ పితామహుడు చుక్క సత్తయ్య అని తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనచారి అన్నారు. శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ఒగ్గు కథ పితామహుడు చుక్క సత్తయ్య సంస్కరణసభ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిరికొండ మధుసూదన చారి మాట్లాడుతూ ఒగ్గుకళ సామ్రాట్ చుక్క సత్తయ్య అని ,బీరప్ప కథను ఒగ్గుకళలో విలీనం చేసి ఈ కళకే వన్నె తెచ్చారని అన్నారు. కార్యక్రమంలో రచయిత్రి శైలజామిత్ర, సంఘ సేవకులు పి ఎస్ ఆర్ మూర్తి, వడ్లకొండ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



హైకాన్ 24 డాగ్ అండ్ క్యాట్‌షోలోని దృశ్యం

## నవరస భరితం యువన కూచిపూడి నృత్యం

**నాంపల్లి, నవంబరు 24 ప్రభాతవార్త :** చిన్ననాటి నుండే భారతీయ శాస్త్రీయ సంప్రదాయ కళలపై అమితాశక్తితో ఆరవయేటనే తల్లిదండ్రులు ధర్మశీలన్, షన్ముగప్రియల ప్రోత్సాహంతో కళాకారిణి యువన ప్రఖ్యాత నాట్యగురువు నీహంత్రిరెడ్డి వద్ద కూచిపూడి నృత్యశిక్షణ ప్రారంభించి నేడు సంపూర్ణపరిణతితో తన కూచిపూడి రంగప్రవేశం నవరసభరితం రసరమ్యంగా ప్రదర్శించింది. అక్షధ స్కూల్ ఆఫ్ పెర్ఫామింగ్ ఆర్ట్స్ నిర్వహణలో ఆదివారం రాత్రి బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో డి.యువన కూచిపూడి రంగప్రవేశంలో తొలుత సంప్రదాయ ప్రార్థన వాణి పరాకుతో ప్రారంభించి ప్రఖ్యాత కూచిపూడి నాట్యగురువు డా. శోభా నాయుడు విరచిత ప్రణామ్యమహం; కృష్ణం కలియసకి అంశాలు; డా. వెంపటి చినసత్యం విరచిత భామాకలాపం; పరులన్నమాట అంశాలు; ప్రముఖ నాట్యగురువు నీహంత్రిరెడ్డి విరచిత కా వ వ; మఝ్ఞ మహర పండరి అంశాలను లయబద్ధంగా అద్భుత హావభావాలను ఒలికిస్తూ కావించిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆహుతులకు నేత్రపర్వం చేసింది. కొరియోగ్రఫీ గురువు నీహంత్రిరెడ్డి, నట్టువాంగం రేణుకా ప్రసాద్- నీహంత్రి రెడ్డిలు; గాత్రం స్వేతప్రసాద్, మృదంగం వి.శ్రీధరాచారి, వయోలిన్ సాయికుమార్, వేణువు ఉమా వెంకటేశ్వర్లు, తబల డా. ఆర్.శ్రీకాంత్‌లు అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ అతిథులు నాట్యకళాకారిణి యువనను ఘనంగా సత్కరించి మున్ముందు గొప్ప కళాకారిణిగా పేరుప్రఖ్యాతులు పొందాలని శుభాశీస్సులందజేశారు.

## పత్రికలు, ఛానల్స్ ప్రజల పక్షాన నిలబడాలి

**సైఫాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త:** పత్రికలు, ఛానల్స్ ఏ రాజకీయ పార్టీ పక్షాన కొమ్ముకాయకుండా ప్రజల పక్షాన నిలబడి వారి గొంతుకగా మారాలని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి సూచించారు. తెలంగాణ ఉద్యమంలో పత్రికలు, ఛానల్స్ ఎంతో నిబద్ధతతో పనిచేశాయని ఆయన కొనియాడారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఒక టివి చానల్ వార్షికోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. కాచం సత్యనారాయణగుప్తా తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేశారని, ఆయన చేపట్టిన ఏ కార్యక్రమమైన విజయవంతం చేస్తారని కొనియాడారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం సమయంలో వచ్చిన పత్రికలు, ఛానల్స్ భావ వ్యాప్తికి ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఛానల్స్, పత్రికలు నడపడం ఎంతో కష్టంగా ఉందన్నారు. ప్రముఖ పాత్రికేయులు కాచం సత్యనారాయణగుప్తా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా తాము ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తున్నామని చెప్పారు. ఈ సభలో సీనియర్ అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవిఎల్, సీనియర్ పాత్రికేయులు రావికంటి శ్రీనివాస్, పొతుగంటి వెంకటరమణ, ఏలె మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులకు శుభ ముహూర్తాలు..!

### డిసెంబరులో మోగనున్న పెళ్లి బాజాలు



**హైదరాబాద్, నవంబరు 24, ప్రభాతవార్త** పెళ్లి అనేది జీవితంలో మధుర ఘట్టం. దాన్ని ఎంతో అపురూపంగా జరుపుకుంటారు వధూవరులు. రెండు కుటుంబాల వారూ..కొత్త దంపతుల్ని ఆశీర్వదిస్తూ..నిండు నూరేళ్లూ, పిల్లాపాపలతో హాయిగా జీవించాలని ఆశీర్వదిస్తారు. అందుకే అందరూ మెచ్చుకునేలా, పదికాలాలు గుర్తుండి పోయేలా వైభవంగా జరుపుకోవాలని భావిస్తారు. అందుకు తగ్గట్లే ఏర్పాట్లు చేసుకుంటారు. బంధువులందరి సమక్షంలో ఆనందంగా పెళ్లి కార్యక్రమం జరుపుకుంటారు. దీంతో ఫంక్షన్ హాళ్లు, పురోహితులకు, మంగళ వాయిద్యాలు, ఫుడ్‌క్యాటరింగ్, డెకరేషన్, ఫొటోగ్రాఫర్లకు, షామియానా పూలదండలు, తదితర వ్యాపారులకు ఈ కొన్ని రోజులు చేతినిండా పని దొరకనుంది. నవంబర్‌లో పెళ్లి సందడి నెలకొంది. మళ్లీ ముహూర్తాల సందడి మొదలైంది. ఈ క్రమంలో వచ్చే నెల డిసెంబర్లో కూడా పెళ్లిళ్లకు శుభ ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు తెలిపారు. దీంతో పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా పెళ్లి బజాలు మోగనున్నాయి. పెళ్లిళ్లు, గృహప్రవేశాలు తదితర శుభకార్యాలతో కాలనీ, బస్తీలు కళకళలాడనున్నాయి. డిసెంబరు (మార్గశిర)లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఈ నెలలో బలమైన ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు, సిద్ధాంతులు చెబుతున్నారు. ఇప్పటికే ఈనెలలో ముహూర్తాలు పూర్తికావడంతో..డిసెంబరు 4,5,6,7,8,10,11, 12, 14, 15, 20, 22, 24, 25,26వ తేదీలు వివాహాలకు అనుకూలమైనవని పండితులు చెబుతున్నారు. దీంతో భాగ్యనగరంలో భారీ సంఖ్యలో వివాహాలు జరుగుతాయి. ఇక జనవరిలో మంచి ముహూర్తాలులేవు. జనవరి 31 నుంచి మార్చి 4 వరకు మాఘమాసంలో శుభకార్యాలకు ముహూర్తాలు ఉన్నాయని ప్రముఖ అధ్యాత్మికవేత్త, పురోహితులు అనంతచారి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వెడ్డింగ్స్ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. పెళ్లిళ్లతోపాటూ..గృహ ప్రవేశాలు, వాహనాల కొనుగోళ్లు, ఉపనయనాల వంటి వాటికి మంచి ముహూర్తాల సమాచారాల కోసం పురోహితులను ఆశ్రయిస్తూ ఏర్పాటు చేసుకుంటున్నారు. వ్యక్తుల నక్షత్రాలు, రాశుల ఆధారంగా వేర్వేరు ముహూర్తాలను పండితులు సూచిస్తున్నారు. ఆర్థిక వనరుల కనుగుణంగా హోటళ్లు, రెస్టారెంట్లు, కేటరింగ్, ఫొటోగ్రఫీ వారికి ఆర్డర్లు వెళ్తున్నాయి. వస్త్ర, నగర వ్యాపారల్లో జోరు కనిపిస్తోంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్‌లు కూడా పెరిగాయని ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులు పేర్కొంటున్నారు. వచ్చే నెలలో వివాహాల సంఖ్య ఎక్కువగా ఉండడంతో, కొంత మంది పూజారులు ఒకే రోజు రెండు పెళ్లిళ్లను కూడా జరిపేందుకు బుక్‌చేసుకుంటున్నారు. నగరంలో ఫంక్షన్‌హాల్ ధరలు లక్షల్లో ఉండడంతో కొందరు మధ్యతరగతి కుటుంబాలు తమ వివాహ వేడుకను వధువు ఇంట్లో జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. కొంతమంది తమ పెళ్లిళ్లను కమ్యూనిటీ భవనాల్లో, ఇళ్ల ముందు, ఖాళీ ప్రదేశాల్లో జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

## 'పూర్ణత్వపు పొలిమేరలో' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న మెట్రో రైల్ ఎండి ఎన్వీఎస్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త** విశ్వనాథ సాహిత్య పీఠం ద్విశతాబ్ది ఉత్సవాలలో భాగంగా నగరంలో సాహిత్య సౌరభాలు వెల్లివిరిసాయి. ఆదివారం అమీర్‌పేటలో జరిగిన సాహిత్య సభలో విశ్వనాథుల సాహితీ వైభవాన్ని పలువురు ప్రముఖులు ప్రస్తుతించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయితలు రచించిన పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సాహితీ స్ఫూర్తిని అందిపుచ్చుకున్న స్వర్గీయ సిరివెన్నెల సీతారామశాస్త్రి వ్యక్తిత్వాన్ని ఆయన సోదరుడు చేంబోలు శ్రీరామశాస్త్రి హృద్యంగా అక్షర రూపం ఇచ్చారు. ఆయన రచించిన 'పూర్ణత్వపు పొలిమేరలో' పుస్తకాన్ని హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామశాస్త్రి సోదరుడు మనందరికన్నా ఆయన జీవితాన్ని దగ్గరగా చూసిన వ్యక్తి శ్రీరామశాస్త్రి అని, ఆయన రచించిన ఈ పుస్తకం ద్వారా సిరివెన్నెల గారి స్ఫూర్తివంతమైన జీవితాన్ని సమాజానికి మరింత లోతుగా పరిచయం చేయడం గొప్ప విషయమని అన్నారు. సులభతరమైన సాహిత్యంతో పండిత పామరులను సైతం ఈ పుస్తకం ఆకట్టుకుంటుందని అన్నారు. ఆర్షధర్మాన్నీ, భారతీయతను, మంచితనాన్నీ, మనిషితనాన్నీ, మానవీయతను, విప్లవాత్మకతను తనదైన శైలిలో, పద సౌందర్యంతో చక్కటి పాటలు తన కలం నుండి జాలువారించి సిరి వెన్నెల సీతారామశాస్త్రి తెలుగువారి గుండెల్లో తన స్థానాన్ని పదిలపరుచుకొన్నారని ఎన్వీఎస్ రెడ్డి కొనియాడారు. కోవిడ్ కాలంలో నాకు దొరికిన విశ్రాంతి సమయాన్ని వినియోగించుకొని తాను హైదరాబాద్ మెట్రో రైల్ చరిత్రనంతా 58 కవితలుగా మాత్రాచ్ఛందస్సులో 'మేఘపథం' అనే కావ్యంగా రాసినపుడు శాస్త్రి గారు దానికి ముందుమాట రాస్తానన్నారు. కానీ, ఆయన అనారోగ్యం వల్ల రాయకుండానే వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఆయన అమరుడు, అమృతాన్ని కురిపించిన గొప్పవ్యక్తి, ఆయన కురిపించిన అమృతాన్ని మనం దోసిళ్లతో తాగ గల్గుతున్నామని ఆయన తెలిపారు. విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ వెల్చాల కొండలరావు సమర్పణలో ముద్రితమైన ఈ చిరు పుస్తకం సిరివెన్నెల వ్యక్తిత్వాన్ని క్లుప్తంగా తెలియపరచే మంచి పుస్తకం అని శ్రీ ఎన్వీఎస్‌రెడ్డి అభివర్ణించారు.


సర్వే డేటా ఎంట్రీనిపరిశీలిస్తున్న మేయర్ పారిజాత, కమిషనర్ సరస్వతి

## సమగ్ర కుటుంబ సర్వే, కుల గణన డేటా ఎంట్రీ తనిఖీ

**సరూర్‌నగర్, నవంబరు 24 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సమగ్ర కుటుంబ సర్వే, కుల గణనల డేటా ఎంట్రీని ఆదివారం మేయర్ చిగిరింత పారిజాతనర్సింహారెడ్డి తనిఖీ చేశారు. నాదర్‌గుల్ కమ్మగూడలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.సరస్వతి ఆధ్వర్యంలో కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా సర్వే వివరాలను ఎంట్రీ చేస్తున్న నేపథ్యంలో ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంట్రీకి సంబంధించినవిషయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు.

**సర్వే జరగని కుటుంబాలు డిఇని సంప్రదించాలి...**

మరో రెండు రోజుల్లో సర్వే ముగుస్తున్నందున కార్పొరేషన్‌లో ఎక్కడైనా సర్వే జరగని కుటుంబాల వారు కార్పొరేషన్ డిఇ నర్సింహరాజు (ఫోన్ 9849452398)ను సంప్రదించాలని కమిషనర్ సరస్వతి కోరారు. కార్పొరేషన్‌లో వంద శాతం సర్వేను చేయిస్తున్నామని ఆమె వెల్లడించారు. సర్వే జరగని వారు డిఇని సంప్రదించి ఎన్యూమరేటర్ల ద్వారా వివరాలు నమోదు చేయించాలని ఆమె సూచించారు. సర్వేలో వివరాలు తెలపడానికి నిరాకరించిన వారి వివరాల జాబితాను కూడా తయారు చేస్తున్నామని ఆమె తెలిపారు.

## సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం

**మణికొండ కమిషనర్ ప్రదీప్‌కుమార్**


సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్న ప్రదీప్‌కుమార్

**నార్సింగి, నవంబరు 24 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలనుంచి సేకరించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నామని కమిషనర్ ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామంలో ఉన్న శ్రీదేవి ఇంజనీరింగ్ కళాశాలలో మణికొండ మున్సిపల్ సర్వే వివరాలను ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మణికొండ మున్సిపాలిటీలోని ప్రజల నుంచి సేకరించిన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే డేటాఎంట్రీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని వివరించారు. త్వరలోనే సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో ఎక్కించడం జరుగుతుందన్నారు. ప్రజలిచ్చిన పూర్తి సమాచారంను ఆన్‌లైన్‌లో ఎక్కించే పని ప్రారంభించామన్నారు. తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు సర్వే సిబ్బందికి వివరాలు ఇవ్వని వారుంటే సోమవారం మీ ఇళ్ల వద్దకు వచ్చే వాలెంటీర్లకు తెలుపాలని, లేదంటే మణికొండ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంనెంబర్‌లు 18005997575/ 9440279049కు కాల్‌చేసి వివరాలు తెలుపాలని కమిషనర్ ప్రదీప్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు : కార్పొరేటర్

**శేరిలింగంపల్లి, నవంబరు 24 ప్రభాతవార్త**


చందానగర్ అండర్ రైల్వే బ్రిడ్జిని పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌కాలనీలోని చందానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నెలకున్న సమస్యను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పర్యవేక్షించారు. పాపిరెడ్డినగర్‌కాలనీతో పాటు స్థానికంగా ఉన్న పలు కాలనీల వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా పరిణమించిన రైల్వే అండర్ బ్రిడ్జిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సంబంధిత అధికారులతో చర్చించి స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వాహన దారులకు ఉపయోగపడేలా అండర్ బ్రిడ్జిను అందుబాటులోకి తీసుకువచ్చారు. అందులో భాగంగా అండర్ బ్రిడ్జి వద్ద సీపేజ్ వల్ల వచ్చిన నీటిని తొలగించే పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ ఏఈ భాస్కర్‌తో పాటు స్థానికి కాలనీ వాసులతో కలిసి పర్యవేక్షించారు. సమస్య మరలా తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఏ చిన్న సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షులు దుర్గం వీరేశం గౌడ్, పాపిరెడ్డినగర్ కాలనీ అధ్యక్షులు కొండల్‌రెడ్డి, వార్డు సభ్యులు రాంబాబు, శ్రీకళ, లింగరెడ్డి, సందయ్యకాలనీ అధ్యక్షులు బస్వరాజ్, రమేష్, ప్రభాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కుమారి, సుధారాణి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## నగర శివార్లలో బాలాపూర్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

**తెరిచి ఉన్న హోటళ్లు, పాన్‌షాపులకు వార్నింగ్**

**సరూర్‌నగర్, నవంబరు 24 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్థరాత్రి వరకు తెరిచి ఉన్న హోటళ్ళు, పాన్ షాపుల వద్ద పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అర్ధరాత్రి వేళల్లో సంచరిస్తున్న వారిని సోదాలు చేసి కౌన్సిలింగ్ చేశారు. ఇన్స్‌పెక్టర్ సుధాకర్ తన సిబ్బందితో కలిసి పిఎస్ పరిధిలో శనివారం అర్ధరాత్రి సమయంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తెరిచి ఉన్న హోటళ్ళు, పాన్ షాపుల వద్ద తనిఖీలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు హోటళ్ళు, పాన్‌షాపుల వారు సమయాన్ని పాటించాలనీ లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదే విధంగా అర్ధరాత్రి సమయంలో ఏ పని లేకున్నా అనవసరంగా తిరిగే వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. నేరాల నియంత్రణకు అందరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.


అర్ధరాత్రి తిరుగుతున్న యువకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ సుధాకర్

# కెటిఆర్‌కు గతంలో చేసిన నిర్బంధం గుర్తుకు రాలేదా ?

**బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ యుగేందర్‌గౌడ్**


మాట్లాడుతున్న రాచాల యుగేందర్‌గౌడ్

**సైఫాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డిని నియంత అంటూ విమర్శిస్తున్న మాజీమంత్రి కెటిఆర్‌కు బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేసిన నిర్బంధం గుర్తుకురాలేదా?, మాజీ సిఎం కెసిఆర్‌కు మించిన నియంత మరొకరు లేరని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగేందర్‌గౌడ్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి రైతుల కోసం పోరాటం చేస్తున్నారని కెటిఆర్ కితాబ్ ఇచ్చారని, రైతుల నుంచి కమీషన్ తీసుకున్న నరేందర్‌రెడ్డి రైతుల పక్షపాతి ఎలా అవుతారని ప్రశ్నించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యుగేందర్‌రెడ్డి మాట్లాడుతూ షాబాద్ ప్రాంతంలో భూములు రిజిస్ట్రేషన్ కావాలంటే పన్ను కట్టాల్సిందేనని, టాటాకంపెనీ కూడా పట్నం పన్ను చెల్లించలేక కలకత్తాకు వెళ్ళిపోయిన సంగతి వాస్తవంగా కదా? అని నిలదీశారు. సీతారామపురం హయత్‌నగర్ అస్సైన్డ్ భూముల విషయంలో ఎన్నో అవకతవకలు జరిగాయని, ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం ఎకరానికి 21 లక్షలు భూపరిహారం ఇస్తే అందులో సగం డబ్బులు పట్నం నరేందర్ రెడ్డి పన్ను కింద దండుకున్న నీచమైన చరిత్ర ఆయనదని, షాబాద్ ఫాంహౌస్‌లో అధికారులను బెదిరించి భూములను రిజిస్ట్రేషన్ చేయించింది వాస్తవం కాదా? అని రాచాల ప్రశ్నించారు. ఎన్నో సంవత్సరాలుగా వెనకబడిన కొడంగల్‌లో పరిశ్రమలు వస్తే ఓర్చుకోవడం లేదని, సిద్దిపేట, గజ్వేల్ సిరిసిల్ల అభివృద్ధి చేసుకున్న కెసిఆర్, కెటిఆర్‌లను తమ నాయకుడు రేవంత్‌రెడ్డి ఏమి అనలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రజల జీవన ప్రమాణాలను పెంచే ప్రయత్నం చేస్తున్న సిఎంపై వారికి ఎందుకంత కడుపుమంట అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పేరుతో దోపిడీ చేసిన కెసిఆర్, కెటిఆర్ అధికారులను బలిచేశారని, మల్లన్న సాగర్, కొండ పోచమ్మసాగర్, రంగనాయకసాగర్ నిర్వాసితులను పరిగెత్తించి కొట్టించిన సంగతి కెటిఆర్ మరిచిపోయారా? అని ఆయన గుర్తు చేశారు. రైతులను, వ్యాపారులను, పారిశ్రామిక వేత్తలను బెదిరించిన నీచమైన చరిత్ర మీదేనని, ప్రజా పాలన అందిస్తున్న రేవంత్‌రెడ్డిపై కెటిఆర్ అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని, లేని పక్షంలో తీవ్రమైన పరిణామాలు ఉంటాయని రాచాల హెచ్చరించారు.

## బాధిత కుటుంబానికి రూ. 2 లక్షలు అందజేత

**సరూర్‌నగర్, నవంబరు 24 ప్రభాతవార్త:** అకాల మృతి చెందిన జిల్లెలగూడ ప్రాంతానికి చెందిన మెకానిక్ కుటుంబానికి టూ వీలర్స్ అసోసియేషన్ మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా రూ.2 లక్షలు అందజేసింది. ఆదివారం మెకానిక్ నివాసానికి వచ్చిన సబితా ఇంద్రారెడ్డి మృతుడి కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, నాయకులు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వీరురెడ్డి, టూ వీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు అంబోజీ నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తి, సామాజిక సేవలో ఎన్‌ఎస్‌ఎస్‌ది కీలక పాత్ర


ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్స్ ఆఫీసర్‌తో ప్రిన్సిపల్ ఎవి రాజశేఖర్

**సైఫాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త:** దేశభక్తి, సామాజిక సేవ, ఉన్నతమైన విలువలను పెంపొందించడంలో ఎన్‌సిసితోపాటు ఎన్‌ఎస్‌ఎస్ దేశంలో కీలక పాత్ర పోషిస్తున్నదని నిజాం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎ.వి.రాజశేఖర్ చెప్పారు. ఆదివారం నిజాం కళాశాలలో జరిగిన ఎన్‌సిసి డే సందర్భంగా ఆయన ప్రసంగించారు. వైస్-ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శిస్తున్న ప్రతిభా పాటవాలతోపాటు జాతీయ స్థాయిలో సాధిస్తున్న అవార్డులు నిజాం కళాశాలకు ఎంతో గర్వకారణమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి కెప్టెన్ టి.గంగాధర్, ఆఫీసర్ డా.నవీన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. సి.హెచ్.వెంకటేశ్వర్లు, అకాడమిక్ కో-ఆర్డినేటర్ ఎస్.రేణుక తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎన్‌సిసి క్యాడెట్లు పెరేడ్‌తోపాటు పలు విన్యాసాలను ప్రదర్శించి, అందరిని అకట్టుకున్నారు

## మహారాష్ట్రలో బిజెపి గెలుపుతో హర్షాతిరేకాలు

**ఘట్‌కేసర్, నవంబరు 24, ప్రభాతవార్త:** కాంగ్రెస్ విభజిత కుట్ర రాజకీయాలకు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టు అని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. చౌదరిగూడ విజయపురికాలనీ చౌరస్తాలో బిజెపి నాయకులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి నినాదాలు చేస్తూ మిఠాయిలు తినిపించుకున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో విజయం సాధించడం, ఉపఎన్నికల్లో బిజెపి గెలుపొందడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌పార్టీ కుట్రలతో ప్రజల మధ్య విభజన రాజకీయాల ద్వారా లబ్దిపొందాలని చూసినప్పటికి దేశంలోని అన్నిప్రాంతాల ప్రజలు మోదీ నాయకత్వంలోనే దేశం సురక్షితంగా ఉంటుందని నమ్మి ఎన్నికల్లో పట్టం కడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నిరుడి రామారావు, నాయకులు గొంగళ్ల బాలేశ్, బసవ రాజుగౌడ్, సురేశ్‌నాయక్, రావుల శ్రీకాంత్, జగదీష్‌గౌడ్, సత్యనారాయణ, మహేశ్, వెంకటేశ్, కరుణాకర్, బిక్షపతిగౌడ్, స్నేహ మహేశ్, యాదగిరి, శివకుమార్, అజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

## విలీన గ్రామాల్లో వీధిదీపాల ఏర్పాటు

**ఘట్‌కేసర్, నవంబరు 24, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ వీధిదీపాలకు మరమ్మత్తు పనులు చేయించారు. గత కొంతకాలంగా పలు గ్రామాల్లో లైట్లు వెలగక చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక నాయకుల ద్వారా తెలియజేశారని తెలిపారు. విలీన గ్రామాలు ఘణాపూర్, లింగాపూర్, అవుషాపూర్, అంకుశాపూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ తన సొంత ఖర్చులతో 54 విద్యుత్‌లైట్లు వేయించి ప్రజల సమస్యను తీర్చారు. మరో కొన్ని చోట్ల కూడా లైట్లు వేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్ గౌడ్, మాజీ సర్పంచులు నానవత్ రూప్‌సింగ్‌నాయక్, బద్దం గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచులు వేముల సత్తయ్యగౌడ్, వేముల పరమేశ్‌గౌడ్, బత్తుల కృష్ణగౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి పాల్గొన్నారు.

## ఈ-సేవ కేంద్రం ప్రారంభం

**నర్సాపూర్, నవంబరు 24, ప్రభాతవార్త.** నర్సాపూర్‌లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఆదివారం ఈ సేవ కేంద్రాన్ని జూనియర్ సివిల్‌జడ్జ్ సిరిసౌజన్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య, మాట్లాడుతూఈ సేవ కేంద్రాల ద్వారా సత్వరంగా కక్షిదారులు, న్యాయవాదులు కోర్టు వెలువర్చిన తీర్పుల ధ్రువీకరణ పత్రాలను, జమానత్ పత్రాలను (షూరిటీలను) కృత్రిమ మేధస్సు ద్వారా పొందవచ్చని అన్నారు, అదేవిధంగా కక్షిదారులు పలు రకాల సేవలను ఈ సేవ కేంద్రాల ద్వారా పొందవచ్చు అన్నారు.అంతేగాక చిన్న నేరాలకు సంబంధించిన ఫైన్ చెల్లింపులను ఆన్లైన్లో కట్టుటకు వీలు కల్పించడం. కక్షిదారులకు ఎన్నో రకాల సేవలనుఅందించేందుకుగాను ఈ సేవ కేంద్రం యొక్క ప్రధాన ఉద్దేశమని న్యాయమూర్తి సిరి సౌజన్య అన్నారు.ఈ మేరకు ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో నర్సాపూర్ కోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాది పి. సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి. శ్రీధర్ రెడ్డి, నర్సాపూర్‌జూనియర్ సివిల్ జెడ్ కోర్టు సూపరింటెంట్ పద్మావతి, న్యాయవాదులు వి. ప్రభు, సాయిరాం, కోర్టు సిబ్బంది, లీగల్ సర్వీస్ సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న గోశాల కమిటీ ప్రతినిధి పురుషోత్తం గుప్తా

## వైభవంగా భవ్య అన్నకూట్ మహోత్సవం

**చార్మినార్, నవంబరు 24 ప్రభాతవార్త :** కార్తీక మాసం సందర్భంగా ఆదివారం జియాగూడ శ్రీసమర్థ్ కామధేను గోశాలలో అత్యంత వైభవంగా అన్నకూట్ మహోత్సవం జరిగింది. భక్తులు భక్తి శ్రద్ధలతో శివాలయంలో శ్రీ పరమ శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సమర్థ్ కామధేను గోశాల కమిటి ప్రతినిధి పురుషోత్తం గుప్తా మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ప్రతీ సంవత్సరం గోశాలలో భవ్య అన్నకూట్ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ సమర్థ్ కామధేను గోశాల నిర్వాహకులు మహరాజ శ్రీ ప్రభు దత్తతో పాటు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## శెట్టి బలిజల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం: వివేకానంద్

**కుత్బుల్లాపూర్, నవంబరు 24 ప్రభాతవార్త :** శెట్టిబలిజల సంక్షేమానికి నిరంతరం కట్టుబడి వుంటానని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ అన్నారు. ఆదివారం హెచ్‌ఎంటి శ్రీ వేంకటేశ్వర దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన రంగారెడ్డినగర్ శెట్టిబలిజ సంక్షేమ సంఘ 39వ కార్తీకమాస వభోజన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘఅధ్యక్షులు గుత్తుల మీరాకుమార్, ప్రముఖ న్యాయవాది వాసంశెట్టి నాగేశ్వరరావు, టిఆర్‌ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మినారాయణ అధికసంఖ్యలో రంగారెడ్డినగర్ శెట్టిబలిజ సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నిజాంపేటలో కార్తీక వనభోజనాలు

**నిజాంపేట్, నవంబరు 24 ప్రభాతవార్త :** ఆర్యవైశ్యులు సమాజహితం కోసం నిరంతరం కృషిచేస్తూ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారని మేడ్చల్ మల్కాజ్‌గిరి ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షులు పార్శి ప్రకాశ్‌గుప్తా అన్నారు. నిజాంపేట్ బ్రహ్మంగారిగుట్ట ఆందగిరిపై వెలసిన జగన్మాత శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీలోని తెలంగాణ పెనుగొండ గా పేరుగాంచింది. ఈదేవస్థానకమిటీ చైర్మెన్ బచ్చు గంగాధర్‌గుప్తా నాయకత్వంలో నిర్వహించిన కార్తీకమాస వన భోజనాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ వర్కింగ్ ప్రసిడెంట్ బచ్చు చైతన్య గుప్తా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో జగద్గిరిగుట్ట శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ కమిటీ అధ్యక్షులు ఉప్పల రమేశ్‌గుప్తా, వాసవిక్లబ్ అధ్యక్షులు గజ్జి ఉపేందర్‌గుప్తా, ఆర్యవైశ్య యువజన విభాగం అధ్యక్షులు డాక్టర్. నరేశ్‌గుప్తా, మేడ్చల్ జిల్లా కోశాధికారి దారం సతీష్‌గుప్తా, వంకధార ప్రసాద్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్దిలో భాగంగా ఒక్కో పిల్లర్ నిర్మాణానికి , ఇతర అభివృద్ధి నిర్మాణ కార్యక్రమాలకు సహకరించిన దాతలకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కార్తీకంలో ఘనంగా భక్తుల శివాభిషేకం

**ఘట్‌కేసర్, నవంబరు 24, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదూబాద్‌లోని శ్రీభవాని సమేత శ్రీరామలింగేశ్వరస్వామికి భక్తులు భక్తి, శ్రద్దలతో అభిషేకం చేశారు. కార్తీక మాసంలో చివరి ఆదివారం సందర్భంగా శివలింగానికి పలువురు భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వంజరిబస్తీలోని శ్రీరామలింగేశ్వంస్వామికి నిత్యం భక్తులు విశేష పూజలు చేస్తున్నారు. అర్చకులు బ్రహ్మశ్రీ కుమా రశర్మ ఆధ్వర్యంలో స్వామికి రుద్రాభిషేకం చేసి పంచామృతంతో అభిషేకం చేశారు. పాలు, పెరుగు, తెనె,నెయ్యి,విబూతి, పసుపు,కుంకుమ ,పూలు, బిల్వదళాలతో అభిషేకించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదా లు పంపిణీ చేశారు. శివలింగానికి అభిషేకం చేయడం ద్వారా పాపాలు నశించి పుణ్యఫలితం కల్గుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సామల భవాని అమర్, సామల నవీన్, బాలమణి, పొత్కని మల్లికార్జున్‌రాజు, రాకేశ్, సామల వెంకటేశ్, సరిత, కందారి నర్సింహ్మా, రోహిణి, సౌజన్య, శ్రీనివాస్, సారికా, సాయిప్రసన్న, రూప పాల్గొన్నారు.



సికింద్రాబాద్ సెయింట్‌ఆన్స్ హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



మెహిదీపట్నంలోని గ్యారిసన్ గ్రౌండ్స్‌లో ఆదివారం 76వ ఎన్‌సిసి డే సెలబ్రేషన్స్.. కళాకారిణుల నృత్యప్రదర్శనలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

## కార్తీక వనభోజనాల మహోత్సవం

**నిజాంపేట్, నవంబరు 24, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి కౌసల్యకాలనీ రెడ్డి కార్తీకమాస వన భోజనాల మహోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణ రెడ్డి, ఎన్‌ఎంసి మార్కెట్ కమిటీ చైర్మన్ కొలన్ సీతారాం రెడ్డి, కొలన్ యుద్దామ్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్, నవంబరు 24 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతులు కారణంగా 25వ తేదీ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రంనాస్ పుర ఫీడర్, ఏజి కాలనీ ఫీడర్ పరిధిలో 11 నుంచి 12 గంటలు వరకు,సత్తర్‌బాగ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు,జూ పార్కు ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు,రషీద్ కాలనీ ఫీడర్ పరిధిలో 12 నుంచి 2 గంటలు వరకు,బిఎస్‌కె కాలనీ ఫీడర్ పరిధిలో 3 నుంచి 5 గంటలు వరకు విద్యుత్ సరఫరా ఉండదని చార్మినార్ సిబిడి ఎడిఇ మహ్మద్ అక్బర్ తెలిపారు.

**నార్సింగ్ ప్రాంతంలో...**

**నార్సింగి, నవంబరు 24 ప్రభాతవార్త :** విద్యుల్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు(సోమవారం) ఈ క్రింది ప్రాంతాలలో కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని కిస్మత్‌పూర్ ఏఈ మల్లేష్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11.కేవీ స్నేహితాహిల్స్ సబ్ స్టేషన్ పరిధిలో 25వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బండ్లగూడ ఎక్సైజ్ అకాడమి, అబ్యుదనగర్, సంధ్యానగర్, ఇందిరమ్మ కాలనీ, ఆదర్శ నగర్, మాచన్‌పల్లి, ఎన్‌క్లేవ్, వీరబ్రహ్మేంద్ర కాలనీ, ద్వారాకానగర్, భారతీ నగర్, యాదవ మిత్ర కాలనీ, డిడి కాలనీ, సాయిబాబానగర్, కాళీమందిర్, బ్యాంకు కాలనీ, మైఖేల్ కాలనీ, డాన్‌బాస్కో రోడ్డు ప్రాంతాలలో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు. ఇందుకు విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని ఏఈ పేర్కొన్నారు.

## రక్తదానానికి యువత ముందుకు రావాలి

**చార్మినార్, నవంబరు 24 ప్రభాతవార్త :** యువత రక్త దానం చేయటానికి ముందుకు రావాలని సెట్విన్ మాజీ చైర్మన్, బిఆర్‌ఎస్ బహదూర్ పుర నియోజక వర్గం ఇంఛార్జీ మీర్‌ఇనాయత్ అలీ బాక్రీ అన్నారు. కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం ఐఎల్‌ఎఫ్‌డబ్ల్యు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిషన్‌బాగ్‌లో రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు అభినందిస్తున్నానన్నారు. కిషన్‌బాగ్ డివిజన్ అధ్యక్షుడు సాయికిరణ్ మాట్లాడుతూ రక్తదానం చేయటం వల్ల మరో వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయికిరణ్, రెహనాబేగం, అమాన్, రషీద్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

## సురభికాలనీలో మెగా మెడికల్ క్యాంప్

**శేరిలింగంపల్లి, నవంబరు 24 ప్రభాతవార్త :** మారుతున్న జీవనశైలిలో పర్యావరణంలో వస్తున్న మార్పులతో ప్రజలు పలురకాల వ్యాధులకు గురవుతున్నారని ప్రముఖ వైద్యులు డాక్టర్ పి.ఆదిత్య అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని సురభికాలనీలో శ్రీఅవేటి మనోహర్ సురభికళా మందిర్‌లో మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో సురభికాలనీ వాసుల సంక్షేమ సంఘ వారి సహకారం, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. శిబిరంలో కన్ను, దంత, రక్తపోటు, షుగర్,పల్స్, బిఎండి, ఆర్థో, బోన్‌మ్యార్ డెన్సిటి, ఈసీజీ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ దిత్య మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహ భాగ్యమని, ప్రతి ఒక్కరూ వ్యాయామం, యోగ, ద్యానం, నడక కనీసం 40 నిముషాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నదీమ్, వాసన్ ఐకేర్ నరేశ్ గౌడ్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎస్.ఏ చంద్రశేఖర్,ఎస్ఏ జయకృష్ణ, సీవీ భాను, వి.జితేంద్ర,ఆర్. వెంకట్‌రెడ్డి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జనార్థన్,పాలం శ్రీను, అమ్మయ్య చౌదరి,విజయలక్ష్మీ,ఎంఎస్ రావు, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగానికి లోబడి దేశం, రాష్ట్రాలు నడుచుకోవాలి

**సుప్రీంకోర్టు న్యాయవాది**

**సైఫాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ అత్యంత పవిత్రమైన గ్రంథమని, ఈ రాజ్యాంగం ప్రతి నివాసంలో ఉండాలని సుప్రీం కోర్టు న్యాయవాది డా.హెచ్.సి.ఉపాధ్యాయ చెప్పారు. భారతదేశం, రాష్ట్రాలు రాజ్యాంగంకు లోబడి నడుచుకోవలిసి ఉంటుందని, రాజ్యాంగం ప్రజలకు జీవించే హక్కు, భావప్రకటన స్వేచ్ఛా కల్పించాయని, సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సమానత్వాన్ని కల్పించిందన్నారు. దక్షిణ భారత న్యాయవాదుల జెఎసి ఆధ్వర్యంలో ఆదివారం జెఎసి కార్యాలయంలో జరిగిన రాజ్యాంగ అవగాహన చైతన్య శిక్షణా శిబిరంలో ఆయన ప్రసంగించారు. జెఎసి అధ్యక్షుడు సుధానాగేందర్ మాట్లాడుతూ ఇంటింటికి రాజ్యాంగం అనే నినాదంతో ఆనేక సంవత్సరాలుగా రాజ్యాంగంపై అవగాహన చైతన్య శిక్షణా శిబిరం ద్వారా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటిలో భగవద్గీత, బైబుల్, ఖురాన్ ఎలా ఉంటుందో, ఆదే విధంగా ప్రతి ఇంట్లో రాజ్యాంగం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు భూపాల్‌రాజ్, ఇ.సుదర్శన్, ఎస్.రామచంద్రారెడ్డి, రామ్‌కిషోర్, సతీష్, ప్రవళిక, మూర్తి, బాలేశం తదితరులు పాల్గొన్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలు పిల్లల్లో మేధాశక్తిని పెంచుతాయి

**పెద్దపల్లి ఎంపి వంశీకృష్ణ**

**హైదరాబాద్, నవంబరు 24, ప్రభాతవార్త:** విద్యార్థిని విద్యార్థుల్లో మేధాశక్తి పెంచుకోవడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపకరిస్తాయని పెద్దపెల్లి లోకసభ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ అన్నారు. బాగ్‌లింగంపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే వైజ్ఞానిక ప్రదర్శనను వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. తమ తాత అయినా జి వెంకటస్వామి ప్రారంభించిన విద్యాసంస్థ గత కొన్ని దశాబ్దాల కాలంగా పేద విద్యార్థిని విద్యార్థులకు అండగా ఉంటూ విద్యాభివృద్ధికి తోడ్పాటును అందిస్తోందని అన్నారు. సైన్స్ ఫెయిర్ నిర్వహణ ద్వారా పిల్లల్లో ఆలోచన శక్తిని పెంచుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ జి సరోజా వివేక్, కార్యదర్శి గడ్డం వినోద్, డైరెక్టర్ విష్ణు ప్రియ హైస్కూల్ ప్రిన్సిపల్ విఠలాచారి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ మేరీ, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**వాసవీ ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో**

## ఇఫ్‌ఎక్స్..2024

**హైదారాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త:** వాసవి ఇంజనీరింగ్‌కాలేజ్‌లో ఎఎస్ఎంఈ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా(ఎఎఫ్) ఆధ్వర్యంలో ఇఫ్‌ఎక్స్.. 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతదేశం నలు మూలల నుంచి సుమారు 300 మందికి పైగా ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ యొక్క ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాక్టికల్ లెర్నింగ్, ఇన్నోవేషన్, నెట్‌వర్కింగ్ వంటి కార్యక్రమాలను నిర్వహించి చైతన్యవేదికగా నిలించింది. ఈ కార్యక్రమంలో భవిష్యత్ ఇంజనీర్లకు ప్రపంచంలోనే ఉన్నత స్థానాల్లో నలిపేందుకు దోహదపడుతుందని అధ్యాపకులు పేర్కొన్నారు. ఈఎఫ్‌ఎక్స్ అనేది అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ నిర్వహించే గ్లోబల్ ఈవెంట్ అన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు సాంకేతిక సవాళ్లను సాఫ్ట్ స్కిల్స్, ఆలోచనల అభివృద్ధి కోసం అవకాశాలతో కలిపి నిర్వహించబడుతుంది. ఈ పోటీల్లో రూ.1.25 లక్షల నగదు బహుమతి ప్రధానం చేశారు. ఉత్తమ ప్రతిభకనబర్చిన వివిద కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులకు బహుమతులను అందజేశారు. డా.పి.చంద్రశేఖర్, డా. జైతీర్థ్, ఆర్.జోషి కీలక ప్రసంగాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ షమి, సత్య భార్గవ నెక్కంటి, డా.వెంకటేశ్వర్లు, డా. రాఘవేంద్ర, గురురాజారావుతో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

**వికారాబాద్, నవంబరు 24, ప్రభాతవార్త:** జిల్లాలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ అర్హత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి తెలిపారు. జిల్లాలో మొత్తం 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, వికారాబాద్ పట్టణంలో 4, తాండూర్ పట్టణంలో2పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ రాత పరీక్షకు 1026 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 975 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఆమె తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాలలో అన్నివసతులు ఏర్పాటు చేసి పరీక్షలను సజావుగా ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించడం జరిగిందని డీఈఓ తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు సంవత్సరానికి 12,000 రూపాయలు చొప్పున స్కాలర్షిప్ వస్తుందని, వికారాబాద్ జిల్లాకు 74 స్కాలర్ షిప్స్ మంజూరయ్యాయని, పరీక్ష రాసిన విద్యార్థుల నుండి 74 మంది విద్యార్థులను మెరిట్ ప్రాతిపాదిక మీద ఎంపిక చేయడం జరుగుతుందని, ఎంపిక ప్రక్రియ మొత్తం రాష్ట్రస్థాయిలో జరుగుతుందని వికారాబాద్ జిల్లా ప్రభుత్వ పరీక్షల ఇన్చార్జి కె.రాంరెడ్డి తెలిపారు.

## జాఫర్‌పల్లి అర్బన్ పార్కును అభివృద్ధి చేస్తా

### -పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి

**పరిగి రూరల్,నవంబరు 24, ప్రభాతవార్త:** కెబిఆర్ పార్కుకు దీటుగా పరిగి, జాఫర్‌పల్లి అర్బన్ పార్కును అభివృద్ధి చేస్తామని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి మండలం జాఫర్ పల్లి ప్రాంతంలోని అటవీ శాఖకు సంబంధించిన 120 ఎకరాలలో 4 కోట్ల వ్యయంతో అర్బన్ పార్క్ అభివృద్ధికి ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాఫర్‌పల్లి అటవీ ప్రాంతంలో అర్బన్ పార్క్ రావడం ఎంతో సంతోషకరమని, వాకింగ్ ట్రాక్‌తో పాటు పచ్చదనాన్ని పెంచుతామని అన్నారు. కార్యక్రమంలో పరిగి రేంజ్ అటవీశాఖ అధికారిణి ప్రతిమరెడ్డి, అటవీశాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు లాల్‌క్రిష్ణ, హనుమంతు ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సేవ చేయడమే ఐక్యత లక్ష్యం

### ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి



అద్దాలను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**ఆమనగల్లు నవంబరు 24 ప్రభాతవార్త:** సంపూర్ణ అంధత్వ నివారణను ప్రజలు బాధ్యతగా స్వీకరించి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంత పేదలకు సేవ చేయడమే ఐక్యత ఫౌండేషన్ ధ్యేయమని, అర్హులైన ప్రతిఒక్కరు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆమనగల్ పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్ లో జరుగుతున్న ఐక్యత ఫౌండేషన్ ఉచిత కంటి పరీక్ష శిబిరం ఆదివారం నాటికి ఆరవ రోజుకు చేరుకుంది. రెండు రోజులుగా కొనసాగుతున్న కంటి శుక్లాల ఆపరేషన్ల లో57 మంది పేషెంట్లకు విజయవంతంగా ఆపరేషన్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్ మాట్లాడుతూ...ఉచిత కంటి శిబిరంలో ఈ రోజుతో సుమారు 4200 మందివరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శించారని, వీరిలో 3000 మంది పేషంట్లకు కంటి పరీక్షలు, దాదాపు 2200 మందికి ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు వారు వివరించారు. అలాగే ఇప్పటి వరకు 120 మందికి పైగా పేషెంట్లు కంటి శుక్లాల సర్జరీ అవసరం ఏర్పడగా వీరందరికీ నవంబర్ 27వరకు ఆపరేషన్లు పూర్తి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు మల్లేష్ నాయక్, కొండల్ రెడ్డి, అభినవ్ రెడ్డి, కొండల్ యాదవ్,రమేష్ నాయక్,మల్లయ్య, శేఖర్, యాదయ్య,శ్రీపతి, తరుణ్ స్వామి, శ్రీను, మహేష్, కాకిశివ,కళ్యాణ్‌లతో పాటు పాల్గొన్నారు.

## ఎస్సీవర్గీకరణ న్యాయమైన డిమాండ్ తగ్గేదేలేదు

**నవాబుపేట నవంబరు 23,ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్‌ని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. 30 ఏళ్ళ సుదీర్ఘ



మండల కేంద్రంలో సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు

పోరాటమని వారన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల ప్రధాన కముటీభవిష్యత్ కార్యచరణపై సమావేశమైయింది. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో ఒక్క మాదిలకే లాభం చేకూరదని అన్ని ఉపకులాలకు కూడా మేలు కలుగుతోందని వారు చెప్పారు. రిజర్వేషన్ల ఫలాలు ఎస్సీ వర్గాలందరికీసమానంగా అందాలన్న సంకల్పం తప్పుకాదని దీనిని కొందరు వ్యతిరేకించడం సిగ్గుచేటని వారు అన్నారు. మాదిగలు, ఉపకులాలవారు చేతకాని వారని కొందరు ప్రగాల్బాలు పలుకుతున్నారని ఇది ఓర్వలేనితనమని వారు విమర్శించారు. నాటినుండి నేటు వరకు కొందరే రిజర్వేషన్లను అపాదించుకున్నారని అందరు అనుభవించాలన్నది నేరం కాదని కొందరు వ్యతిరేకంగా వ్యవ హరించడం సముచితం కాదని అన్నారు. దేనికైనా తగ్గేదేలేదని హెచ్చ రించారు. పోరాటం కొత్తేమి కాదని వారు అన్నారు. కార్యక్రంలో ఎమ్మార్పీఎస్ సినీ యర్ నాయకులు రవికుమార్‌మాదిగ, రత్నంమాదిగ, జాన్‌మాదిగ, రాంచంద్రయ్య మాదిగ, యాదగిరిమాదిగ, పరమానందంమాదిగ, కుషయ్య మాదిగ, రాజుమాదిగ, సుధాకర్‌మాదిగ, బద్రిమాదిగ,అనీల్ మాదిగ, అంజయ్య మాదిగ, చంద్రయ్యమాదిగ, నర్శింలు,బుచ్చయ్య మాదిగ, బందయ్య మాదిగ,శివలింగంమాదిగ జి.నర్శింలు, పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా అవార్డు అందుకున్న మురళి

**జిల్లెడుచౌదరిగూడ, నవంబరు 24,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు మురళి ఉత్తమ సేవా అవార్డును అందు కున్నట్లు తెలిపారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఫిషరిస్‌కోఆపరేటీవ్ సోసైటి చైర్మన్ సాయికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో మురళికి ఉత్తమసేవా అవార్డు ప్రశంసపత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సత్స్య సహకార సంఘం సభ్యులు, గ్రామస్తులు మురళిని అభినందించారు.

## లారీ ఢీకొని భర్త మృతి..భార్యకు గాయాలు

### -యాదగిరిగుట్టకు వెళ్తుండగా ప్రమాదం

**ఘట్‌కేసర్,నవంబరు 24, ప్రభాతవార్త:** లారీ ఢీకొని ఒవ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా తీవ్ర గాయాలైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నుంచి ఒక దంపతులు బైక్‌పై యాదగిరి గుట్టకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టగా భర్త మృతిచెందగా భార్యకు తీవ్రగాయాలయ్యా య్యి. మన్నే లక్ష్మయ్య (55) తన భార్య నాగ జ్యోతితోకలిసిబైక్ మీద యాదగిరిగుట్ట శ్రీలక్ష్మినరసింహ్మాస్వామి దర్శనానికి వెళ్తుండగా ఘట్‌కేసర్ మున్సిపల్ యంనంపేట్ చౌరస్తావద్దఅతివేగంగా వచ్చిన లారీ (టిఎస్30టిఏ-3335) ఢీకొట్టింది. దీంతో లక్ష్మయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా భార్య నాగజ్యోతికి తలకు రక్తగాయాలు కాగా మేడిపల్లిలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈమేరకు ఘట్‌కేసర్ ఘటనా స్థలానికి చేరుకొని లక్ష్మయ్య మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుప త్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున న్నట్లు సీఐ పరశురాం తెలిపారు.

# సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

### సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శిగా అల్లీ దేవేందర్ ఎన్నిక
### -సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ వెల్లడి

**చేవెళ్ళ, నవంబరు 24, ప్రభాతవార్త:** డిసెంబర్ 11,12వ తేదిలల్లో జరిగే సిపిఎం జిల్లా మమసభలను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో సిపిఎం చేవెళ్ల డివిజన్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శిగా అల్లీ దేవేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శిగా అల్లీ దేవేందర్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలపై పోరాటం చేయడం కోసమే పని చేస్తున్నామన్నారు. పేద ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలపై నిత్యం చర్చించి వాటి పరిష్కారా మార్గాలను వెతుకాలన్నారు. ఇళ్ల స్థలాలు, కార్మికుల సమస్య లపై నిరంతరం పోరాటం చేయాలన్నారు. గతంలో ప్రజా ఉద్య మాలను అనేకం నిర్వహించామన్నారు. సిపిఎం చేవెళ్ల డివిజన్ కమిటి కార్య దర్శి అల్లీ దేవేందర్ మాట్లాడుతూ చేవెళ్ల డివిజన్‌లోపార్టీని బలోపేతం చేసేందుకు పాటు పడుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ సంఘాలనాయకులుప్రవీన్‌కుమార్, ప్రభుదాస్,బేగరి అరుణ్‌కుమార్,ఎర్రవల్లిశ్రీనివాస్, స్వామి గౌడ్,బేగరితేజ, పవన్ కుమార్,జంగయ్య, జుబేర్, సాయిబాబా పాల్గొన్నారు.



సిపిఎం చేవెళ్ల డివిజన్ స్థాయి ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్

# దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి

### దేవాలయ కమిటీ సభ్యులు
### పొన్న సుధాకర్‌రెడ్డి, దోనూరి గోపాల్ కురుమ



సమావేశంలో మాట్లాడుతున్న దేవాలయ కమిటీ సభ్యులు

**షాబాద్, నవంబరు 24, ప్రభాతవార్త :** దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని దేవాలయ కమిటీ సభ్యులు పొన్న సుధాకర్‌రెడ్డి, దోనూరి గోపాల్ కురుమలు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ శ్రీమల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా పున:నిర్మిస్తున్న శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయానికి తమవంతు ఆర్థిక సహాయంగా అదే గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పొన్న సుధాకర్‌రెడ్డి, రూ.75లక్షలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన దోనూరి గోపాల్ కురుమ రూ.31లక్షలు, దోనూరి విఠలయ్య రూ.11లక్షలు, మాజీ సర్పంచ్ అనంత్‌రెడ్డి రూ.11లక్షలు,సంఘారెడ్డి రూ.11లక్షలు, బండ ఆశోక్ రూ.9లక్షలు, వెంకట్‌రెడ్డి రూ.6లక్షలు, శేఖర్‌రెడ్డి రూ.6లక్షలు, దోనూరి శంకరయ్య రూ.5లక్షలు, జనార్దన్‌రెడ్డి రూ.5లక్షల చెక్కులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేసిన్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్థులు శాలువాతో ఆయనను ఘనంగా సత్కారించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....ఈ ఆలయం అందరి సహకారంతోనే అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. పురాతన దేవాలయ అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామన్నారు. ఆలయ అభివృద్దిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. భగవంతునిపై భయం కాదు అమితమైన భక్తి ఉండాలన్నారు. అందరి సహకారంతోనే ఇప్పటి వరకు అభివృద్ధి చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దేవాలయంను పెద్ద ఎత్తున్న పునర్ నిర్మిస్తున్నందున ఆసక్తి గత వారి ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి దైవ భక్తి, దేశభక్తి, పితభక్తి, సంఘంభక్తి ఉండాలన్నారు. మారుముల గ్రామా ల్లో ఇంతమంచిగా దేవాలయంను నిర్మించడం అభినందనీయమన్నారు. ఇంకా దాతలు ముందుకు వచ్చి తమకు తోసిన ఆర్థిక సహాయంను అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు లక్ష్మయ్య, సులోచనశేఖర్‌రెడ్డి, బొకులలింగం, ఆలయ కమిటీ నిర్వాహకులు వెంకట్‌రెడ్డి,సాయిరెడ్డి, ముత్యాలరెడ్డి,హన్మంతు,ఆశోక్,గోపాల్‌రెడ్డి,మల్‌రెడ్డి,శశిదర్‌రెడ్డి, యాదయ్య, వేంరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జోగ్గురెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.

# కళ్యాణం.. కమనీయం

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇంట పెళ్లి సందడి
### హాజరైన స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు

**షాద్‌నగర్, నవంబరు 24 (ప్రభాతవార్త) :** పట్టణంలోని రెడ్ రోజ్ గార్డెన్‌లో ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన కోడలు వివాహ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుథ్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను వారు ఆశీర్వదించారు. ఈ వివాహ మహోత్సవ కార్యక్రమానికి షాద్‌నగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు నాయకులు, అధికారులు, పాత్రికేయులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తమ సహచర ఎమ్మెల్యేలతో పాటు మంత్రులు, తదితరులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ వివాహానికి మున్సిపల్ చైర్మన్ నరేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, మాజీ జడ్పీటీసీలు శ్యాంసుందర్ రెడ్డి, విశాల శ్రావణ్ రెడ్డి, పంది వెంకట్‌రాంరెడ్డి, నాయకులు సయ్యద్‌సాదిక్, సీనియర్ జర్నలిస్టులు ఖాజాపాష (కేపీ), భవానీ వేణుగోపాల్, రాఘవేందర్ గౌడ్, రమణ గౌడ్, అరుణ్ కుమార్, దార యాదయ్య, రాజశేఖర్ గౌడ్, ఆర్‌కె రమేష్, ధరమ్‌పాల్‌సింగ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతి రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, రఘు, మహ్మద్ అలీఖాన్ బాబర్, శ్రీకాంత్ రెడ్డి, కట్టా వెంకటేష్ గౌడ్, టీఎన్‌జీవో అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మధురాపురం మాజీ ఎంపీటీసీ భార్గవ్ కుమార్ రెడ్డి, యువ నాయకులు జాంగారి రవి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి 18వ మహాపడిపూజ



అయ్యప్పస్వామి మహాపడి పూజా కార్యక్రమం జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, నవంబరు 24, ప్రభాతవార్త :** లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో శ్రీఅయ్యప్పస్వామి 18వ మహాపడి పూజా కార్యక్రమం ఘనంగ జరిగింది. ఆదివారం శామీర్‌పేట మండలంలోని లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో గురుస్వాములు సత్యం గురుస్వామి, రాజు గురుస్వామిల ఆధ్వర్యంలో లాల్‌గడిమలక్‌పేట్‌కు చెందిన సొల్లూరు గురుస్వామి నిర్వహించిన 18వ మహాపడిపూజకుభారీసంఖ్యలో సన్నిదాన స్వాములు, అయ్యప్ప స్వాములు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాన్ని తిలకించారు. అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మదన్‌మోహన్ భజన మండలి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామిని స్మరిస్తూ భజన కీర్తనలతో ఆట,పాటలతో అయ్యప్ప నామస్మరణతో సన్నిదానం మారుమోగింది. పూజా కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన స్వాములు విచ్చేసి పూజలో పాల్గొన్నారు. దీనిలో డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్దన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, మాజీ సర్పంచు సి.శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ప్రజా పతినిధులు, నాయకులు, భక్తులు,గ్రామస్థులు పాల్గొన్నారు. ఆతరువాత స్వామి వారి తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

## వాక్సర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్

**ఘట్‌కేసర్, నవంబరు 24, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ గురుకుల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా సార చిన్న శ్రీనివాస్‌గౌడ్ ఎన్నిక అయ్యారు. గురుకుల్‌లో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా వాకర్స్ చర్చించుకొని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఘట్‌కేసర్ బాలాజీనగర్‌కు చెందిన సార చిన్న శ్రీనివాస్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయనను వాకర్స్ శాలువాతో సన్మానించారు. అసోసియేషన్ పూర్తి స్థాయి కార్యవర్గాన్ని త్వరలో ఎంపిక చేస్తామని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఘట్‌కేసర్ గురుకుల్ వాకర్స్‌కు అవసరమైన సౌకర్యాలు, క్రీడా, వ్యాయామ సామాగ్రి ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈకార్యక్రమంలో రాజు, బాబు, సురేశ్‌యాదవ్, బాలక్రిష్ణ, ఈశ్వర్, శ్రీనివాస్‌రావు, మురళీగౌడ్, విజయ్‌గౌడ్, రవికాంత్, నాగేశ్వరరావు, అక్తర్, రాము, వంశీ, మురళీ, విజయ్‌కుమార్, సురేశ్, అరవింద్, రాజలింగం, గట్టయ్య, కిరణ్, ప్రభాకర్, కిట్టు, గణేశ్‌గౌడ్, హరిమోహన్‌రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్, మేఘనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు




**ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 24, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 18 వ సర్వసభ్య సమావేశం ఆదివారం అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగింది. ప్రస్తుత పాలకవర్గం కాల పరిమితి పూర్తికానుండటంతో ఎన్నికల త్రిసభ్య కమిటీని ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు. డిసెంబర్ 22వ తేదిన అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించినట్లు తెలిపారు. ఎన్నికల కమిటీ సభ్యులుగా సాయి కుమార్, శృతి, రఫీలను నియమించినట్లు సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ ప్రస్తుత పాలకవర్గం అసోసియేషన్ అధ్యక్షుడు బి. హరి ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో కాలనీ అభివృద్ధికి పలుచర్యలు తీసుకున్నట్లు సభ్యులు తెలిపారు. కాలనీలో పచ్చదనంతో పాటు పరిశుభ్రత, సోలార్ ప్లాంటు ఏర్పాటు, ఎస్‌టీపీ పైపులైన్ వాడుకలోకి తేవడంతో పాటు కాలనీలో ఏ సమస్య ఉన్నా తక్షణమే స్పందించి సేవలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలుఅంశాలపై పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి ఇందిరా ప్రియదర్శిని, భగవాన్ మిత్ర, సత్యనారాయణతో పాటు మున్సిపల్ కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి, కాలనీవాసులు మూర్తి, బి. వెంకట్ రెడ్డి, బి. శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## రమాసత్యనారాయణస్వామిని దర్శించుకున్న మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి

### తుర్కపల్లిలో క్రికెట్ పోటీలను ప్రారంభించిన వైనం



పూజలో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి,పాల్గొన్న తదితరులు

**శామీర్‌పేట, నవంబరు24, ప్రభాతవార్త :** అలియాబాద్‌చౌరస్తా సమీపంలోని రమాసత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగ జరుగుతున్న పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి పాల్గొన్నారు. ఆదివారం శామీర్‌పేట మండలంలోని అలియా బాద్ చౌరస్తా సమీపంలో ఉన్న సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక మాసం పూజల సందర్భంగ ఎమ్మెల్యే మల్లారెడ్డి విచ్చేసి సత్యనారాయణ స్వామిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తరువాత తుర్కపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రారంభించారు. ఆ తరువాత గెనె మైసమ్మ జాతర కార్యక్రమంలో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలోమండలమాజీజడ్పీటిసిఎం. అనిత లాలయ్య, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.మోహన్‌రెడ్డి, మండల నాయకులు వంగ వెంకట్‌రెడ్డి,బిఎన్‌రెడ్డి, టి.జగదీశ్వర్‌గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, యూసుఫ్‌బాబ, మల్లేశ్, ఫనిరాజ్, వెంక టేశ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## 93 శాతం సర్వే పూర్తి

**జిల్లెడుచౌదరిగూడ, నవంబరు 24,(ప్రభాతవార్త):** జిల్లెడుచౌదరిగూడ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇప్పటి వరకు 93శాతం సర్వే పూర్తి అయిందని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరిగి ఇన్యూమరేటర్లు సర్వే చేసినట్లు ఆయన పెర్కొన్నారు. ఇంకా సర్వే చేయించుకునని వారు ఉంటే ఈ నెల 26వ తేది వరకు తమ పూర్తి వివరాలను తెలియజేయాలని ఆయన తెలిపారు. మరింత సమాచారం కోసం 9032586071, 8688722846నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఎఎంసి డైరెక్టర్



అర్బన్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**మాడ్గుల, నవంబరు 24,ప్రభాతవార్త :** ఆమన్‌గల్ వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీలో డైరెక్టర్‌గా మాడ్గుల గ్రామానికి చెందిన పల్లె జంగయ్య గౌడ్ నియమించిన సందర్భంగా కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా హైదరాబాద్‌లోని తన నివాసం లో కలసి ధన్యవాదములు తెలియజేశారు. తన ఎంపిక కు సహకరించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకులు టిపీసీసీ సభ్యులు సూదిని రాంరెడ్డిని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ భట్టు కిషన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు గౌరవరం ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సూదిని కొండల్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమములో విజయ్ డైరీ చైర్మన్ సాయిరెడ్డి, మాడ్గుల ఉపసర్పంచ్ మిద్దెరాములు, మసునవిష్ణు, నూనె పర్వతాలు ,కోణాపురం రమేష్, ఆరోగ్యరెడ్డి పాల్గొన్నారు.

## డేటా ఎంట్రీ సెంటర్‌ను పరిశీలించిన ఎంపిడిఓ



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్

**జిల్లెడుచౌదరిగూడ,నవంబరు 24,(ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతీష్టాత్మకంగ చే పట్టిన కులగణన సర్వే డాటా ఎంట్రి సెంటర్‌లను ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సేవ రించిన సమాచారాన్ని కంప్యూ టర్‌లో ఎంట్రి చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండ చూసు కోవాలని అన్నారు. కంప్యూ టర్‌లో జాగ్రత్తగ డాటా ఎంట్రి చేయడం వల్లన ప్రజలకు ఇబ్బందులు తలెత్తవని పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ హన్మంత్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు సత్య నారాయణరెడ్డి, మహెష్, ఈజిఎస్ కంప్యూటర్ ఆపరేటర్ మధన్ తదితరులు ఉన్నారు.

## ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 16 మంది విద్యార్థులు హాజరు



పరీక్షకు హాజరైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**దుద్యాల్, నవంబరు24, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల నుండి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్షకు 16 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కే.రవీందర్ గౌడ్ తెలిపారు. 8వ తరగతి చదివే ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభగల పేదవిద్యార్థులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. జిల్లా యూని ట్‌గా వివిధ కేటగిరీల ప్రకారం అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని తెలి పారు. ఈ పరీక్ష యందు ప్రతిభ కనబరిచి ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుండి 4సంవత్సరాల పాటు సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున ఎంపికైన విద్యార్థులకు అందిస్తుందని తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు ఉపాధ్యాయులు గోపాల్, చంద్రశేఖర్,మల్లయ్య అభినందించారు.

## ఎఐసిసి కార్యదర్శి చల్లా వంశీ చంద్ రెడ్డి కి సన్మానం



ఎఐసిసికార్యదర్శి చల్లా వంశీ చంద్ రెడ్డిని సన్మానించిన ఏఎంసి చైర్మన్ యాట గీత

**కడ్తాల్, నవంబరు 24, ప్రభాత వార్త:** ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన యాట గీతా నరసింహాఆదివారం కార్యదర్శి, సిడబ్ల్యుసి సభ్యుడు చల్లావంశీచంద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి వంశీ ఆశ్లేష రెడ్డి దంపతులను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. మార్కెట్ చైర్మన్‌గా తననియమకానికి సహ కరించినందుకు వంశీచంద్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని, పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఈ సందర్భంగా వంశి చంద్ రెడ్డి చైర్మన్ గీత నరసింహకు సూచించారు. అదేవిధంగా టీపీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, టి యు ఎఫ్ ఐ డి సి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాతర సింహారెడ్డి, లనుగీత నరసింహ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

## ఓంకారేశ్వరాలయంలో అన్న పూజ...

**యాచారం,నవంబరు 24, ప్రభాత వార్త....** యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలోనిఓంకారేశ్వర స్వామి దేవస్థానం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోకార్తీక మ్మాస పురస్కరించుకొని నేడు సోమవారం రోజున ఉదయం 10 గంటలకు నుండి మూడు గంటల వరకు శ్రీ ఓంకారేశ్వర స్వామి వారికి అన్నాభిషేకము కార్యక్రమం జరుగుతున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పప్పు వెంకట శివకుమార్ కాశ్యపన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్న అభిషేకం, పంచామృత అభిషేకము, ఫలాభిషేకము, పుష్పాభిషేకము, రత్నాభిషేకము వివిధ అభిషేకాలతో ఎంతో వైభవ్వేతంగా నిర్వహించడం జరుగనుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుండి భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి యొక్క అన్నభిషేకాన్ని తిలకించి అభిషేకంలో తదుపరి తదుపరి కుంభహారతి నాగ హారతి నంది హారతి సింహహారతి ఏక హారతి మొదలుకొని ద్వాదశ హారతులుఇచ్చేటప్పుడు108 సార్లు భగవాన్ నామస్మరణ చేస్తూ ఆ పరమేశ్వరుని దర్శిస్తూ అనుగ్రహం పొంది ఇట్టి కార్యక్రమంలోపాల్గొని కోరారు. అన్న మహాప్రసాదాన్ని స్వీకరించి కార్తీక వనభోజనాలలో పాల్గొని స్వామివారి యొక్క కృపకు పాత్రులు కాగలరనీ కోరారు.

## నేడే యాచారంలో మహాపడిపూజ

**యాచారం,నవంబరు 24, ప్రభాతవార్త....** యాచారం మండల కేంద్రంలోని బస్టాండ్ వెనకాల భారతీయ జనతా పార్టీ మాజీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొప్పు బాషా గృహంలో మహా పడి పూజ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఉదయం 8 గంటలకు బ్రహ్మశ్రీ కుట్టన్ చంద్రమోహన్ నాయక్ గురుస్వామి అమృతస్థాలతో ఘనంగాపూజా కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. మండల పరిధిలో ఉన్న అయ్యప్ప స్వాములు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.